వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 06 డిసెంబర్ 2023


## 9న జాతీయ లోక్ అదాలత్

కడప డిసెంబర్ 5, ప్రభాతవార్త

జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 09-12-2023 వ తేదీన ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుంది. మరింత సమాచారం కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్: 08562 258622, 244622 ఈమెయిల్ అడ్రస్: districts.ecourts.gov.in/Kadapa, dlsakdp@gmail.com. జి.గీతా, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మరియు ఇంచార్జ్ చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప మరియు గౌరవ శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

కడప డిసెంబర్ 5, ప్రభాతవార్త

జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు డిఐఈపిసి సభ్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తోపాటు జేసీ గణేష్ కుమార్, కడప నగరపాలక కమిషనర్ ప్రవీణ్ చంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి.. మరింత విస్తృత పరచాలన్నారు. పరిశ్రమలు జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అని.. ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఆ దిశగా.. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేసి.. జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడడంతో పాటు.. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రాత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమల ప్రమోషన్ కు సంబందించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్ లో ఉంటే.. వెంటనే పూర్తి చేయాలన్నారు.

# మిచౌంగ్ తుపాను ధాటికి అరటి రైతు విలవిల

## 6 వేల ఎకరాల్లో పంటనష్టం

**ప్రభుత్వానికి నివేదిక పంపిన కలెక్టర్**

**గుంజననదికి 20 వేల క్యూసెక్కుల వరదనీరు**


**పింఛా ప్రాజెక్టు నుంచి 1235 క్యూసెక్కుల నీరు విడుదల**

**పంటనష్టాన్ని పరిశీలించిన అధికార, ప్రతిపక్ష నేతలు**

**చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లెలో 25 సెం.మీ వర్షం**

రాజంపేట అర్బన్, డిసెంబరు 5 ప్రభాతవార్త

మిచౌంగ్ తుఫాను రైతన్నపై కన్నెర్ర చేసింది. సోమవారం రాత్రి తుఫాను ప్రభావంతో వీచిన పెనుగాలులు అరటి రైతుల వెన్ను విరిచాయి. చేతికొచ్చిన పంట నేలకూలింది. కని విని ఎరుగని రీతిలో సుమారు 6 వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. సత్వరం ప్రభుత్వం పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని అధికా, ప్రతిపక్ష నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. పంటనష్టపోయిన ప్రతిరైతును ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ భరోసా ఇచ్చారు. జడ్పి చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డితో కలిసి ఆకేపాడు ప్రాంతంలో దెబ్బతిన్న అరటి తోటలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఆందోళన చెంద వద్దని, ప్రతిఒక్కరికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పంటనష్టాన్ని సమగ్రంగా చేపట్టాలని ఉద్యానవన, వ్యవసాయాధికారులను ఆదేశించారు. ప్రాథమిక అంచనా మేరకు జిల్లాలో 40 నుంచి 50 కోట్ల వరకు పంటనష్టం జరిగిందని వెల్లడించారు. ప్రతిరైతుకు హెక్టారుకు 27 వేలు నష్టపరిహారం ఇస్తామని తెలియజేశారు. జడ్పి చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి పంటనష్టం వివరాలు తీసుకుపోయి నష్టపోయిన రైతులందరికి పరిహారం అందించేలా చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ జి.రామక్రిష్ణారెడ్డి, జిల్లా ఉద్యాన వన అధికారి రవిచంద్రబాబు, తహశిల్దారు సుబ్రమణ్యంరెడ్డి, రాజంపేట హార్టీకల్చర్ అధికారి సురేష్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఆకేపాడు, మేడావారిపల్లెలో అరటిచెట్లను నరికివేసినట్లు గ్రామమంతా ఎక్కడ చూసినా నేలకూలిన అరటితోటలే కనిపించాయి. అచ్చునపల్లె, పెద్దూరు, కొత్తపల్లె, పెద్దకారంపల్లె, హస్తవరం, చెర్లోపల్లె, బ్రాహ్మణపల్లె, వరదయ్యగారిపల్లె, మేకవారిపల్లె, మిట్టమీదపల్లె, సింగనవారిపల్లె, శవనవారిపల్లె గ్రామాల్లో కలిసి మొత్తం మండలంలో 1344 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో అత్యధికంగా పుల్లంపేటమండలంలో 1326 ఎకరాలు, ఓబులవారిపల్లెలో 534 ఎకరాలు, రైల్వేకోడూరులో 360 ఎకరాలు, చిట్వేలిలో 359 ఎకరాలు మొత్తం రైల్వేకోడూరు నియోజకవర్గంలో 2767 ఎకరాల్లో అరటి పంట నష్టం జరిగింది. మరోవైపు గుంజననదికి 20 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చినట్లు డిఇ చెంగల్‌రాయుడు 'వార్త'కు తెలిపారు. వరదల వల్ల రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాల్లో నీటి వనరులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. పింఛా నది నుంచి 1235 క్యూసెక్కుల వరదనీరు చెయ్యేరు నదిలోకి విడుదల చేసినట్లు ఇఇ వెంకటరామయ్య తెలిపారు. పింఛా ప్రాజెక్టు వద్దే డిఇ వెంకటేశ్వర్‌రావు, ఎఇ మధుసూదన్‌రావు దగ్గరుండి నీటి ఉధృతిని పరిశీలిస్తున్నారు. మిచౌంగ్ తుఫాను ప్రభావంతో చిట్వేలిలో 24.6 సెం.మి, రైల్వేకోడూరు 23.6 సెం.మి. పెనగలూరులో 22.8 సెం.మి, నందలూరులో 13 సెం.మి., రాజంపేటలో 11 సెం.మి., టి.సుండుపల్లె, కంభంవారిపల్లెలో 10 సెం.మి., కలికిరి 8 సెం.మి. వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా మిచౌంగ్ తుఫాను ప్రభావంతో 23.92 మి.మీ. వర్షపాతం నమోదు అయ్యింది. దీంతో రైతులకు కరవు వేళ ఈ వర్షం ఊరటనిచ్చింది. చెయ్యేరు నదిలోకి ఎవరు దిగవద్దని మరో 2 రోజుల పాటు వరదనీరు ప్రవహిస్తుందని ఇఇ రవికిరణ్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పుల్లంగేరు నుంచి పోలిచెరుకు నీరు వెళ్లే తూములలో చెట్లు ఇరుక్కుపోవడంతో మాజీ మార్కెట్‌కమిటి చైర్మన్ నియోజకవర్గ టిడిపి నేత పోలి వెంకటసుబ్బారెడ్డి జెసిబిని పంపి తొలగించారు. దీంతో తెల్లవారుజామున ఉధృతంగా సాగింది. తిరుమల కొండల్లోని ఉత్తర ప్రాంతం నుంచి అడవుల్లో పడిన వర్షానికి ఈ పుల్లంగేరు కొంత ఉధృతంగానే రావటం జరిగింది. అయితే సాయంత్రానికి అంతా ఉధృత తగ్గి సాదా సీదాగా ప్రవాహం కొనసాగింది. దీంతో రెడ్డిపల్లె చెరువుకు నీరు రావడం జరిగింది. నూకనపల్లె ఆనకట్ట నుంచి పోలిచెరువు వరకు అనాసముద్రం, చిన్న చెరువు, పెద్ద చెరువు నుంచి ఊటుకూరు చెరువు వరకు ఉన్న చెరువులు, ఆనకట్టలు, కాలువలు ద్వారా పుల్లంగేరు నీరే వెళతాయి. దీంతో ఈ ప్రాంతమంతా భూగర్భజలాలు పెరగాలంటే ఒక్క పుల్లంగేరు దిక్కు. ఈ పరిస్థితుల్లో భూగర్జబలాలు అడుగంటి వచ్చే వేసవికి బోరుబావుల్లో నీరు తగ్గిపోతాయని ఆందోళన చెందుతున్న సమయంలో ఉన్నట్టుండి నెల్లూరు - చెన్నై మధ్య తుఫాను రావడం, పుల్లంగేరు ప్రవహించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చిట్వేలిలో అలుగు పొర్లుతున్న ఎల్లమ్మరాజు చెరువు

పుల్లంపేట మండలంలో తుఫాను ప్రభావం నేపథ్యంలో వీచిన పెనుగాలులకు అరటితోటలను జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ మంగళవారం పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి రైల్వేకోడూరు వెళుతూ ఆకస్మికంగా ఆయన మండలంలోని రెడ్డిపల్లె సచివాలయం చేరుకుని ఆ పైన రెడ్డిపల్లె పరిసర ప్రాంతాల్లో తుఫానుకు దెబ్బతిన్న అరటితోటలను పరిశీలించడం జరిగింది. మండలంలోని 20 గ్రామ పంచాయతిల్లోని అరటితోటలు తుఫాను వల్ల వీచిన గాలులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్కొక్క రైతుకు సంబంధించి కొన్ని గ్రామాల్లో 5 నుంచి 7 వేల చెట్లు ఉన్నతోటల్లో 75 శాతం పైగా నేలకొరిగిపోయాయి. ఈ విషయాన్ని ఎంపిపి బాబుల్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంతో రైతులందరికి సాయం చేయడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం గాలికి పడిపోయిన తోటలను పరిశీలించి నమోదు చేయాలని కూడా ఆయన సిబ్బందికి సూచించినట్లు ఎంపిపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహాశిల్దారు కుమార్, సిబ్బంది, వైసిపి నాయకులు సుదర్శన్‌రెడ్డి, రంగారెడ్డి, రెడ్డయ్య ఉన్నారు.

### బాధితులను ఆదుకుంటాం : కలెక్టర్

తుఫాన్ వరదలకు దెబ్బతిన్న పండ్ల తోటల రైతులను అన్ని రకాల ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నమయ్య జిల్లా కలెక్టర్ పిఎస్. గిరీష్ అన్నారు. సోమవారం కురిసిన వర్షాలకు, పెనుగాలులకు దెబ్బతిన్న అరటి, బొప్పాయి, ఆకు తోటలను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రాజంపేట, రైల్వేకోడూరు రహదారుల్లో సుడిగాలి పర్యటన చేశారు. దెబ్బతిన్న పండ్ల తోటలను , పొంగిపొర్లుతున్న వాగులు, వంకలను, దెబ్బతిన్న గ్రామీణ రహదారులను పరిశీలించారు. మీచౌక్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న రైతులకు, ప్రజలకు అన్ని రకాల ఆర్థిక సాయం అందజేసి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈయనతో పాటు రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఆర్డీవో రామ

### మగ్గం గుంతల్లో నీళ్లు

తుఫాను కారణంగా రెండు రోజులుగా జడివాన కురిసి పుల్లంగేరు ప్రవహించడంతో పుల్లంపేటలో మగ్గం గుంతల్లోకి నీరు చేరాయని పలువురు నేతన్నలు తెలిపారు. వర్షం కారణంగా నేత సాగకపోవడంతో కొంత ఇబ్బందులు పడతున్నామని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.

## మిచౌంగ్ తుఫానుతో నిండుకుండలా చెరువులు

చిట్వేలి, డిసెంబరు 5 ప్రభాతవార్త


మిచౌంగ్ తుఫాను ప్రభావంతో సోమ, మంగళవారాల్లో ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు చిట్వేలి మండలవ్యాప్తంగా 246 ఎంఎం వర్షం నమోదు అయ్యింది. జిల్లాలో అతిపెద్ద చెరువు అయిన యల్లమరాజు చెరువు, రాజుకుంట, నగిరిపాడు, నాగవరం, దేవమాచుపల్లె, మాలేమార్పురం తదితర గ్రామాల చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగులు పారాయి. పలుచోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లాయి. అనుంపల్లి, ఎం.రాచపల్లె, సిఎం రాచపల్లె పలుచోట్ల వరద ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. తహశిల్దారు శిరీషా, ఎస్ఐ సుభాష్‌చంద్ర తన సిబ్బందితో పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చిట్వేలి గ్రామంలో నేలకొరిగిన భారీ వృక్షాలను గ్రామ ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి చొరవతో యుద్ధప్రాతిపదికన తొలగించారు. మండల వ్యాప్తంగా తలెత్తిన విద్యుత్ సమస్యలను ఎఇ చలపతి తన సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఎలాంటి పశు, ప్రాణ నష్టం సంభవించలేదు. తుఫాను ప్రభావం మంగళవారం ఉదయం నుంచి తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

### పంటనష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం

భారీ వర్షంతో పాటు ఈదురుగాలులు తోడవ్వడంతో ఉద్యాన పంట రైతులు అపారంగా నష్టపోయారని ఉద్యానశాఖ అధికారిని ఆసియా తెలిపారు. రెవెన్యూ, ఆర్‌బికె సిబ్బందితో కలిసి పంటనష్టాన్ని పరిశీలించిన తాను మాట్లాడుతూ 450 ఎకరాల అరటి, 25 ఎకరాల బొప్పాయి, 2 ఎకరాల నిమ్మ, 4 ఎకరాల చామంతి పూర్తిస్థాయిలో నేలమట్టం అయ్యిందన్నారు. ప్రాథమిక అంచనాగా సుమారు4.66 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అంచనాగా ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు. ఆర్‌బికె సిబ్బందికి వారం వ్యవధిలో పూర్తి పంటనష్ట నివేదికను సిద్ధం చేయాలని సూచించినట్లు ఆసియా తెలిపారు.

### శాశ్వత బ్రిడ్జి చేపట్టాలి

ఆంజనేయస్వామి క్రాస్, అనుంపల్లి సమీపంలో నెల్లూరు - కడప ఇరు జిల్లాల రాకపోకలకు అవసరమైన శాశ్వత బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని భాజపా జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ అన్నారు. ఉదయం నుంచి అక్కడే వేచి ఉన్న ప్రయాణికులతో మాట్లాడారు. ఆరోగ్య, అవసర నిమిత్తం సమీప గ్రామ ప్రజలు ప్రయాణం చేయలేని ఈ పరిస్థితి ప్రతిసారి ఉందన్నారు. హడావుడి చేయడం, హామీలు ఇవ్వడమే తప్ప పాలకులు మాట నిలుపుకోలేదన్నారు. దీంతో పాటు ఎం.రాచపల్లి గ్రామస్థులు ఇబ్బందిని గుర్తించాలన్నారు. ఇతనితో పాటు బిజెపి నాయకులు తొంబరపు సుబ్బరాయుడు ఉన్నారు.



రాపూరు ఘాట్‌లో కొండల నుంచి జాలువారుతున్న జలపాతాలు

# తుపానుతో జిల్లాలో దెబ్బతిన్న పంటల దృశ్యాలు



ఓబులవారిపల్లెలో మిచౌంగ్ తుపానుకి నేలరాలిన అరటి



కడపలో జలమయమైన రోడ్డు



రైల్వేకోడూరులో అరటితోటను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు



మదనపల్లిలో 500 ఎకరాల్లో దెబ్బతిన్న వరిపంట



రాయచోటిలో వర్షం ధాటికి పడిపోయిన వేపచెట్టు




పుల్లంపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న పుల్లంగేరు



చిట్వేలిలో దెబ్బతిన్న అరటి తోట



మైదుకూరులో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు



గోపవరంలో దెబ్బతిన్న వరిపంట



కడపలో జలమయమైన రోడ్లను పరిశీలిస్తున్న టిడిపి జిల్లా ఇన్‌చార్జి మాధవిరెడ్డి, ఆర్. శ్రీనివాసరెడ్డి



పంట నష్టం అంచనాపై అధికారులతో చర్చిస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా

## కరాటే పోటీలో ప్రతిభ కనపరచిన నారాయణ పాఠశాల విద్యార్థులు




బద్వేల్ నవంబర 6, ప్రభాతవార్త

బద్వేల్ స్థానిక తెలుగుగంగ కాలనీలో ఉండే నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివే విద్యార్థులు కర్నూలు వేదికగా ఆదివారం నిర్వహించిన సౌత్ ఇండియన్ ఓపెన్ కరాటే 2023 పోటీలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్ తెలిపారు. పాఠశాల ఏజీఎం నజీర్ అహ్మద్ గారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని విద్యార్థులను ప్రశంసించారు. 10 నుండి 12 సంవత్సరాల విభాగంలో కుమ్మితే (ఫైటింగ్) లో పి హేజిత్ రెడ్డి బంగారు పతకం సాధించాడు.

12 నుండి 14 సంవత్సరాల బాలికల విభాగంలో అలంకృత రజత పథకం సాధించింది. అలాగే వేదాంత రెడ్డి సుశాంత్ రెడ్డి కార్తీక్ రెడ్డి కాంస్య పథకాలు సాధించారు. పాఠశాల కరాటే మాస్టర్ దయాకర్ ఆధ్వర్యంలో ఈ విద్యార్థులు ప్రగతిని సాధించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని ప్రధానోపాధ్యాయులు ప్రశంసించారు. క్రీడలు చదువులో భాగమని ప్రధానోపాధ్యాయులు కిషోర్ గారు తెలియజేశారు.

## ప్రకృతి బీభత్సంతో నేలకొరిగిన పండ్ల తోటలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 5, ప్రభాతవార్త

ప్రకృతి విపత్తుతో పండ్ల తోటలు వేల ఎకరాలలో నేలకొరిగాయి. మిచౌంగ్ తుపాను కారణంగా పండ్ల తోటల రైతులు తీవ్రంగా నష్టపోవడంతో పాటు రైతుల కంట కన్నీరు కారుతోంది. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె, పుల్లంపేట, కోడూరు తదితర మండలాల్లో దెబ్బతిన్న పండ్ల తోటలను, ఆకు తోటలను పరిశీలించి వెంటనే రైతులకు తక్షణ సాయం అందించాలని సంబంధిత అధికారులను రైతుల జాబితాను నివేదికను పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టరు ఎదుట రైతులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. సహాయం అందేలా చర్యలు చేపడతామని కలెక్టరు రైతులకు భరోసా కల్పించారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, గంగాధర్, నెల్లూరు ఎన్నికల పరిశీలకులు సాయికిశోర్‌రెడ్డి, వేమన వర్మ, దుర్గారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, జరుగు నారాయణరెడ్డి, నూకా జైపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఆళ్ల అర్పణ, శ్రీధర్, సుధాకర్, అధికారులు ఎంపీడీవో విజయారావు, డిప్యూటీ తహసీల్దారు పీర్‌మున్నీ, ఏవో మల్లిక, ఎమ్మార్వై రామ్మోహన్ సింగ్, ఓబులేసు, బాదుల్లా, హార్టికల్చర్ అధికారులు వెంకటేష్, వీఆర్వోలు శివప్రసాద్, హరిప్రసాద్, వెంకట కృష్ణయ్య, మనోహర్, మురళీ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్పంచులు ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవాలి



పెండ్లిమర్రి, డిసెంబరు 5, ప్రభాతవార్త

పెండ్లిమర్రి మండలం పగడాలపల్లె సర్పంచ్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నఉంచి గ్రామ పంచాయతీలకు సర్పంచులకు కేంద్రం ఇచ్చే నిధులను కూడా ఇవ్వకుండా ఉత్సవ విగ్రహంలా చేశారన్నారు. కేంద్రం కూడా సచివాలయాలను ఏర్పాటు చేసుకొని ప్రజలకు నేరుగా నిధులు ఇస్తే సీఎం జగన్ ఒప్పుకుంటాడా అని ప్రశ్నించారు. గ్రామ వికాస్ పత్రాన్ని గ్రామ ప్రజలకు అందజేసి గ్రామంలోని సమస్యలను ఇంటింటికి సర్పంచులు తిరిగి కనుక్కోవాలన్నారు. 14వ తేదీ కడపలో జరిగే సర్పంచుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యే మాజీ సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి ఈ సమస్యలన్నీ తీసుకెళ్లి తెదేపా ప్రభుత్వం వస్తే తమ సమస్యలను తీర్చే విధంగా హామీ తీసుకుంటామని రాజేంద్రప్రసాద్ తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో అన్నదానం



రామాపురం, డిసెంబరు 5, ప్రభాతవార్త

లక్కిరెడ్డిపల్లె సుధాకర్‌రెడ్డి, సుజాత దంపతుల పెళ్లి రోజు సందర్భంగా ప్రేమాలయం ఆశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి.ఎస్.హరినాథ్‌రెడ్డి తెలిపారు. అనంతరం దాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పెళ్లి రోజు సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే సంకల్పంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేయడం జరిగిందని అలాగే రాబోయే రోజుల్లో ప్రజలకు ఉపయోపగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి నా వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి లయన్ వి.హరీష్ చంద్ర, బండపల్లి భాను ప్రకాష్, వినోద్‌కుమార్ నాయక్, చవ్వాకుల మదన మోహన్, ఇంద్రావతి, సాలమ్మ, లక్ష్మి, సుబ్రమణ్య ఆచారి, ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ఎస్‌యూ నూతన నగర కమిటీ ఎంపిక

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:

రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ మంగళవారం కడప నగర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చెన్నకేశవరెడ్డి కడప నగర అధ్యక్షుడిగా హరిబాబు, కడప నగర కార్యదర్శిగా సుమంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం ప్రమాదంలో ఉందని విద్యారంగ పరిరక్షణకు రాబోయే కాలంలో ఉమ్మడి ఉద్యమం అవసరమన్నారు. పాఠశాలల విద్యలో అనేక మార్పులు వల్ల గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఐనార్టీ విద్యార్థులకు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక విభజన హామీలు సాధన కోసం కడప నగరం వేదిక అనేక ఉద్యమాలు చేస్తామని వాళ్లన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ప్రమోద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో టీడీపీ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి పర్యటన

కడప వైద్యవిభాగం, డిసెంబరు 5, ప్రభాతవార్త

రడస అభివృద్ధి కోసం రూ.2150 కోట్లు ఎక్కడ ఖర్చు పెట్టారో డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలని, తినడానికి అన్నం మెతుకులు లేవు అంటే మీ పాలనకు సంపంగి నూనె కావాలన్న చందాన డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా వ్యవహారశైలి ఉందని కడప టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.మాధవిరెడ్డి అన్నారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలైన వైఎస్ఆర్ లేఅవుట్, వై.జంక్షన్, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులు స్వయంగా పరిశీలించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు అంజాద్ బాషాకు బైబై చెప్తారని సేవ్ కడప నినాదంతో ప్రజల్లోకి వెళ్తామన్నారు.

## నా మిగులు 5 సెంట్ల భూమి ఇప్పించండి

### – బాధితుడు వనిపెంట మహబూబ్ హుసేన్

కడప వైద్యవిభాగం, డిసెంబరు 5, ప్రభాతవార్త



ఖాజీపేట మండలం కె.బుడ్డాయపల్లె సుంకేసుల పొలంలో నేషనల్ హైవేకి నా భూమి 0.50 సెంట్లు ఉంది. అందులో 0.45 సెంట్లు భూమి హైవే రోడుకు పోయింది. మిగిలిన 5 సెంట్లు భూమిని చూపించమని వనిపెంట మహ బూబ్ హుసేన్ అధికారులను కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుంకేసుల పొలంలో సర్వే నంబరు 73బి, 74 నందు 0.50 సెంట్లు భూమి గత 40 సంవత్సరాలుగా కొనసాగుతున్నాని ఇటీవల నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో 45 సెంట్లు పోగా మిగిలిన 5 సెంట్లు రావాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి మిగులు భూమిని ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

## ఆజాద్ నగర్‌లో డ్రైనేజీలు నిర్మించాలి

### – గగ్గుటూరు నజీర్



కడప వైద్యవిభాగం, డిసెంబరు 5, ప్రభాతవార్త

ఆజాద్‌నగర్‌లో డ్రైనేజీలు లేక ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెదేపా ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి గగ్గుటూరు నజీర్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలు దాటినా ఇంత వరకు డ్రైనేజీలు వేయకపోవడం దుర్భష్టకరమన్నారు. డ్రైనేజీ లేకపోవడంతో దోమలు అధికమై ప్రజలు అనారోగ్య పాలవుతున్నారన్నారు. డ్రైనేజీ నీరంతా రోడ్లపై ప్రవహిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై తాను జిల్లా ఉన్నత స్థాయి అధికారులు దృష్టికి తీసుకెళ్తానని ఆయన స్పష్టం చేశారు.

## మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి : యూటీఎఫ్




కడప కార్పొరేషన్, డిసెంబరు 5, ప్రభాతవార్త

మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని ఉన్నత పాఠశాలల్లోని అన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం కడప నగరపాలక సంస్థ ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబులు మాట్లాడుతూ 2022 జూన్‌లో మున్సిపల్ ఉపాధ్యాయులు సర్వీసులు, మున్సిపల్ యాజమాన్యం నుంచి పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి వచ్చాయని కేడర్ స్ట్రెంత్ సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. మౌలికమైన సమస్యలు కొన్ని పరిష్కారం కాలేదని తెలిపారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీలు కొనసాగుతున్నారని సబ్జెక్టు టీచర్ల కొరత తగ్గించడానికి వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించలేదని, బదిలీలు, ప్రమోషన్లు, అప్గ్రేడేషన్ అమలు జరుపుతామని విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్య మేరీ నాయకులు వెంకట సుబ్బయ్య, శివకుమార్ రాజు, శివశంకర్, కిరణ్‌కుమార్, కరీముల్లా దేవ దత్తం సిద్దయ్య బాబు, శ్రీనివాసులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తుపాన్ కారణంగా కడప నగర రోడ్లు జలమయం



కడప కార్పొరేషన్, డిసెంబరు 5, ప్రభాతవార్త

కురిసిన వర్షానికి కడప నగరంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కాలువలు పొంగి పొర్లుతున్నాయి. నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద పెద్దఎత్తున వర్షం నీరు చేరడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కోర్టు ఆవరణం ఎదురుగా వర్షపు నీరు వచ్చి చేరింది. సాయంత్రానికి కొద్దిగా తగ్గుముఖం పట్టింది. ప్రకాష్నగర్ వీధులన్నీ జలమయం అయ్యాయి. ఆర్‌కే నగర్‌లో వరద నీటి కారణంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కీరుపల్లె దారి, అల్మాస్‌పేట, ఆర్టీసీ బస్టాండు నుంచి అప్సరా సర్కిల్ వెళ్లే దారి జలమయం అయ్యాయి. కడప నగరంలో మురికి కాలువల నిర్మాణంలో ఉండడం కారణంగా వరద నీరు ప్రవహించడానికి సమయం పడుతుంది. రోడ్లపై వరద నీరు నిల్వ ఉండడం కారణంగా ప్రయాణికులు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన వైపు మురికి నీరు కూడా వరద నీటిలో కలుస్తుంది. వర్షం కురిసిన ప్రతి సారి ఇదే దుస్థితి కడపలో నెలకొంది. కార్పొరేషన్ అధికారులు కడప నగరంలో తగు చర్యలు చేపడుతున్నారు.

## దూదేకులు ఖబరస్థాన్ అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు,డిశంబరు05,ప్రభాతవార్త

పట్టణంలోని ఆంధ్రకేసరి రోడ్డులోని దూదేకుల సంఘం మసీదు మరియు ఖబరస్థాన్ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలి పారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని దూదేకుల సంఘం నాయకులు కలిసి ఆంధ్రకేసరి రోడ్డులోని దూదేకుల సంఘం మసీదు, ఖబరస్తాన్‌ను అభివృదిచేయాలని కోరారు.వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాచమల్లు హామి ఇచ్చి మున్సిపల్ కమీషనర్‌తో మాట్లాడి ఖబరస్థాన్ అభివృద్ధికి సహాయసహకారం అందించాలని ఆదేశించారు.సంఘం నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు పగడాల ఓబులేసు, మసీదు కమిటి అధ్యక్షులు చెరుకూరినాగూర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి, నాయకులు దస్తగిరి, మహమ్మద్ రఫీ, కిరణ్, జూటూరు దస్తగిరి, సుబ్బరాయుడు, దస్తగిరి, కమాల్ బాష, మౌళాళి,హుశేన్‌బాష,సుభాన్ పాల్గొన్నారు.

## రైతులపై కనక వర్షం కురిపిస్తున్న 'నల్ల పసుపు'



పసుపు పసుపు రంగులోనే ఉంటుందని మనంతా అనుకుంటాం.. కానీ, అది ఎంతమాత్రం నిజం కాదు. పసుపు నల్ల రంగులోనూ ఉంటుంది. అవును, నల్ల పసుపు సాగు చేస్తూ కొందరు రైతులు పెట్టుబడికి పది రెట్లు ఆదాయం ఆర్జిస్తున్నారు. ఎందుకంటే.. ఇది సాధారణ పసుపు కంటే.. మార్కెట్‌లో అధిక రేటు కలిగి ఉంది. దీనిని ఆయుర్వేద ఔషధాల తయారీలో ఉపయోగించడం జరుగుతుంది. సాధారణ పసుపులో కంటే ఈ నల్ల పసుపులో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే దీనికి డిమాండ్, కాస్ట్ ఎక్కువ. దీనిని గుర్తించే బిహార్‌కు చెందిన ఓ రైతు ఈ బ్లాక్ పసుపును సాగు చేస్తున్నాడు. తద్వారా తన సంపాదనను పెంచుకుంటున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇప్పుడు చూద్దాం.. బీహార్‌కు చెందిన రైతు కమలేష్.. తూర్పు చంపారన్‌లోని నర్కటియాగంజ్ బ్లాక్‌లో ఉన్న ముషర్వా గ్రామ నివాసి. తనకు ఉన్న కొద్దిపాటి భూమిలో నల్ల పసుపు సాగు ప్రారంభించాడు. ఒక పొలంలో 25 కిలోల నల్ల పసుపును విత్తగా.. దాని ద్వారా ఒకటిన్నర క్వింటాళ్ల పసుపు ఉత్పత్తి వచ్చింది. ఇక ఆ పసుపు నకు మార్కెట్‌లో మాంచి రేటు ఉండటంతో వారి సంపాదన కూడా పెరిగిపోయింది. విశేషమేమిటంటే కమలేష్ నల్ల పసుపును పండించడానికి నాగాలాండ్ నుండి విత్తనాలను తీసుకువచ్చాడు. రూ. 500 వెచ్చించి కిలో విత్తనాలు కొనుగోలు చేశాడు. మొత్తం 25 కిలోల విత్తనాలు కొనేందుకు రూ.12,500 అతను పెట్టుబడిగా పెట్టాడు. అయితే, వచ్చిన పంట 150 కిలోలు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో పసుపు రూ.500 నుంచి రూ.5000 వరకు పలుకుతోంది. కమలేష్ నల్ల పసుపును కిలో రూ.1000కి విక్రయిస్తే.. 150 కిలోల పసుపును విక్రయించినట్లయితే.. రూ.1.5 లక్షల ఆదాయం అతనికి లభిస్తుంది. అంతకు మించి అమ్మితే.. ఆదాయం కూడా భారీగా పెరుగుతుంది. అంటే.. అతను పెట్టిన పెట్టుబడికి 10 రెట్లకు పైగానే ఆదాయం లభిస్తుంది. మంచి ఆదాయం కూడా వస్తుండటంతో రైతు కమలేష్ సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.వ్యవసాయ శాస్త్రవేత్త అభిక్ పాత్ర ప్రకారం.. నల్ల పసుపు ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీని నుండి అనేక ఔషధాలను తయారు చేస్తారు. సాధారణ పసుపుతో పోలిస్తే ఈ నల్ల పసుపు ధర చాలా రెట్లు ఎక్కువ. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో కూడా రైతులు పెద్దఎత్తున దీనిని సాగు చేస్తున్నారు. నల్ల పసుపులో ఆంథోసైనిన్ పుష్కలంగా లభిస్తుంది. అందుకే ముదురు ఊదా రంగులో కనిపిస్తుంది. దీనితో పాటు యాంటీ ఆస్తమా, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఫంగల్, యాంటీ కన్వల్సెంట్, అనాల్జెసిక్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ అల్సర్ వంటి ప్రత్యేక గుణాలు నల్ల పసుపులో ఉన్నాయి.

## కృత్రిమ మేధస్సుతో ఉపాధికి ముప్పు!



కృత్రిమ మేధస్సు (ఎఐ) ఉపాధికి ముప్పుగా పరిణమిస్తోందా? అంటే ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి ముందు అసలు కృత్రిమ మేధస్సు అంటే ఏమిటో నిర్వచించడం తెలివైన పని. అలా చూసినపుడు సామాజిక మాధ్యమాలు, చిత్రాలు, టివి స్టూడియోలు, స్ట్రీమింగ్ వీడియోలు ఇవన్నీ తెరపైకి వస్తాయి. అయ్యే ఖర్చును తగ్గించుకోవడం కోసం ఈ సంస్థల అధిపతులందరూ కృత్రిమ మేధస్సును అమలు చేయాలని తహతహలాడుతున్నారు. ఒక రోజు పని కోసం పనిలోకి పెట్టుకోకుండా, వేతనం చెల్లించనక్కర లేకుండా పోతుందన్నది వారి ఆశ. వర్కర్ ఫోటో, గొంతు, మేనరిజమ్స్, మొత్తంగా శరీరాన్ని కంప్యూటకరీ కరించడం ద్వారా పనిచేసే వ్యక్తిని కృత్రిమంగా పున:సృష్టించేయవచ్చు. వర్కర్‌కు ఒక్క రూపాయి కూడా చెల్లించనక్కరలేకుండానే పని జరిగిపోతుంది. అదనపు పనికి అదనపు జీతం చెల్లించనక్కరలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే వర్కర్ల స్థానంలో 'జాంబీలను తీసుకువస్తారు. ఇదిలాగే వదిలేస్తే, కృత్రిమ మేధస్సు ఆర్థిక అసమానతలను పెంచుతుంది. ఉపాధి భద్రతకు విఘాతం కల్పిస్తుందని ఎఎఫ్ఎల్-సిఐఎ సెక్రటరీ, ట్రెజరర్ ఫ్రెడ్ రెడ్‌మాండ్ హెచ్చరించారు.కొన్ని పరిశ్రమల్లో ఎఐ, హెచ్ఆర్ విభాగం చేసే పనులన్నీ చేసేయగలదు. అంటే కంప్యూటరే మనల్ని ఉద్యోగం నుండి తొలగించేయగలదు. పనిని, పని చేసే వర్కర్లను మెరుగుపరిచే సాంకేతికత వున్నట్లే,అసలు పనిచేసేవారే అవసరం లేని సాంకేతికత రావడంతో ఉపాధికి ఇది ముప్పుగానే పరిణమిస్తోంది.

## మనిషితో మాట్లాడం మరచిపోతున్న యువత

### ఒంటరితనంతో బాధపడుతున్న వృద్ధులు



ప్రపంచం కొత్త ముప్పును ఎదుర్కొంటోంది.. ఆ ముప్పు ఒంటరితనం అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ఒక నివేదికను శుక్రవారం విడుదల చేసింది . WHO ఒంటరితనాన్ని తీవ్రమైన ఆరోగ్య ముప్పుగా అభివర్ణించింది. రానున్న కాలంలో వృద్ధులు, యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వెల్లడించింది. ప్రతి నలుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరితనంతో బాధపడుతున్నారని నివేదిక వెల్లడించింది. WHO నివేదిక ప్రకారం తగినంత సంఖ్యలో సామాజిక పరిచయాలు, వ్యక్తులతో కనెక్ట్ కాకుండా ఒంటరిగా ఉండాలని కోరుకోవడమే పెద్ద సమస్యగా మారుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా అధిక ఆదాయ దేశాలలో, వృద్ధులు ఎక్కువగా ఒంటరితనంతో బారిన పడుతున్నారు. అయినప్పటికీ ఇది అన్ని వయసుల వారిని ప్రభావితం చేస్తుంది. WHO నిర్వహించిన పరిశోధన ప్రకారం ప్రతి నలుగురిలో ఒకరు ఒంటరితనంతో బాధపడుతున్నారు. అంతేకాదు ఐదు నుండి 15 శాతం మంది యువకుల్లో సామాజిక ఒంటరితనం సాధారణంగా మారిపోయింది. ఈ గణాంకాల ప్రకారం పరిస్థితి ఇలాగే కొనసాగితే పరిస్థితి ఇంతకంటే చాలా ప్రమాదకరంగా మారుతుందని వెల్లడించింది. ఐక్యరాజ్యసమితి ఆరోగ్య సంస్థ సామాజిక సంబంధాలను ప్రోత్సహించడానికి కొత్త కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది అన్ని దేశాలలో పని చేస్తుంది.. ప్రజల ఒంటరితనాన్ని అధిగమించడానికి ప్రయత్నిస్తుందని వెల్లడించింది. సామాజిక అనుసంధానం లేకపోవడం వల్ల ధూమపానం, అతిగా మద్యం సేవించడం, సోమరితనం, ఊబకాయం, ఒత్తిడికి వంటి ఇబ్బందులకు దారితీస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. సామాజిక ఒంటరితనం శారీరక, మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని WHO పరిశోధన చెబుతోంది. ఇది ఆందోళన, నిరాశతో ముడిపడి ఉందని .. గుండె జబ్బుల ప్రమాదాన్ని 30 శాతం పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. WHO డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సామాజిక ఒంటరితనం అధికమైందని.. ఈ ఒంటరితనంతో తీవ్ర అనారోగ్య బారిన పడుతున్నారని.. తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. బలమైన సామాజిక సంబంధాలు లేని వ్యక్తులు స్ట్రోక్, ఆందోళన, చిత్తవైకల్యం, నిరాశ, ఆత్మహత్య వంటి భావాలకు గురయ్యే ప్రమాదం ఉంది. WHO కమీషన్ సామాజిక సంబంధాలను ఏర్పరచుకోవడానికి.. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్య ప్రాధాన్యతను తెలియజేస్తూ.. మనిషి మనిషితో పరిచయాన్ని పెంచుకోవాలని .. ఇతరుల మంచి విషయాల్లో జోక్యం చేసుకోవాలని అది మానసిక వికాసానికి సాయం చేస్తుందని ఆయన అన్నారు. WHO ఏర్పాటు చేసిన ఈ కమిషన్‌లో అమెరికన్ సర్జన్ జనరల్ డాక్టర్. వివేక్ మూర్తి , ఆఫ్రికన్ యూనియన్ యూత్ ఎన్వోయ్, చిడో ఎంపెంబాతో సహా 11 మంది సభ్యులు ఉన్నారు. ఈ కమిషన్ మూడేళ్లపాటు అన్ని వయసుల వ్యక్తుల సామాజిక సంబంధాలను పెంచడంలో పెద్ద పాత్ర పోషిస్తుంది. సామాజిక పరిచయాలను చేసుకునే విధంగా పరిష్కారాలను వివరిస్తుంది. అంతేకాదు కీలకమైన సంఘాలు, సమాజం అభివృద్ధి కోసం సామాజిక సంబంధాలు ఎలా పని చేస్తాయో కూడా ఈ కమిషన్ నిర్ణయిస్తుంది.

## పీలేరు నియోజకవర్గం సర్పంచుల సంఘం అధ్యక్షురాలుగా లక్ష్మీప్రసన్న కమలనాథ్

కలికిరి, డిసెంబరు 5, ప్రభాతవార్త:

పీలేరు నియోజకవర్గం సర్పంచుల సంఘం అధ్యక్షురాలిగా కలకడ మండలం కదిరాయ చెరువు పంచాయతీ సర్పంచ్ లక్ష్మీప్రసన్న కమలనాథ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగింది. పీలేరులో సర్పంచుల సంఘం సమావేశం రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగమశెట్టి సుబ్బరామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పీలేరు నియోజకవర్గంలోని మండలాల నుంచి అధిక సంఖ్యలో సర్పంచులు హాజరయ్యారు. అనంతరం కమిటీ ఎంపిక చేయడం జరిగింది. అధ్యక్షురాలిగా లక్ష్మీప్రసన్న కమలానాథ్, ఉపాధ్యక్షుడిగా ఉపాధ్యక్షులుగా రెడ్డప్పనాయుడు, సైపుల్లా, కార్యవర్గ సభ్యులుగా కలికిరి మండలం మునోళ్లపల్లె సర్పంచ్ శశికళ, పి.సంద్రవారిపల్లె సర్పంచ్ జావీదా ఇంకా మరికొందరిని ఎంపిక చేయడం జరిగింది. అనంతరం పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సుబ్బరామయ్య మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో సర్పంచ్‌ల సమావేశం పంచాయతీరాజ్ జాతీయ అధ్యక్షులు వైవీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పలు ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు ప్రభుత్వంపై నిరసనల కార్యక్రమాలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈనెల 15న కడపలో శంకారావం కార్యక్రమానికి అఖిలపక్ష పార్టీ నాయకులను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇంకా పలువురు వివిధ పార్టీల నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో సర్పంచులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ 4వ జోన్ నాయకులు మునిరెడ్డి, పంచాయతీ ఛాంబర్ కార్యదర్శి జనార్ధన్‌గౌడ్, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి అమ్మిటి రెడ్డిరామ్, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతోనే గుండ్లపల్లి అభివృద్ధి



తంబళ్లపల్లె, డిసెంబరు 5, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లి పంచాయతీ అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలతో పాటు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఇచ్చిన సహకారంతో అభివృద్ధి చేయగలిగానని సర్పంచ్ మౌలాలి తెలిపారు. మంగళవారం గుండ్లపల్లి సచివాలయంలో ఆయనతో పాటు వాటర్‌షెడ్ ఛైర్మన్ పెద్దశేఖర్‌రెడ్డిలు వై నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మన ఇంటికే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించే జగన్ ప్రభుత్వం పిలిస్తే పలికే నాయకుడుగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిని, ఏ సమస్య వచ్చినా తక్షణం పరిష్కరించే ఎంపీ మిథున్‌రెడ్డిలను మరో మారు గెలిపించుకుంటే తంబళ్లపల్లె అభివృద్ధికి తిరుగే ఉండదని అభివర్ణించారు. అనంతరం ఎంపీడీవో సురేంద్రనాథ్ పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులను గ్రామ సభకు వివరించారు. చివరిగా వైకాపా జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి, ఎంపీటీసీ రవి నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రేపన చౌడేశ్వర, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజిని సురేంద్ర, గంగిరెడ్డిపల్లి జయసింహారెడ్డి, సింగల్ విండో మాజీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ఎర్రగుండ్లపల్లి శివారెడ్డి, ఎల్ఐసీ రమణారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లి సచివాలయ పరిధిలో ఈవీఎంలపై అవగాహన



తంబళ్లపల్లె, డిసెంబరు 5, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లి సచివాలయ పరిధిలోని వేమారెడ్డిగారిపల్లె, గంగిరెడ్డిపల్లె, అన్నగారిపల్లిలో ఓటర్లకు ఎన్నికల సెక్టోరియల్ అధికారి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి ఓటు ఎలా వేయాలి, వీవీప్యాడ్‌లో మీరు వేసిన ఓటు సరిచూసుకునే విధానంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. అలాగే 18 ఏళ్లు పైబడిన యువత కచ్చితంగా ఫారం-6 ద్వారా ఓటర్లుగా నమోదు కావాలన్నారు. ఈ ఓటర్ల అవగాహన కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు.కార్యక్రమంలో పోలింగ్ డెమో ఆఫీసర్ కెవిన్, వీఆర్వో మాధవరెడ్డి, సర్పంచ్ మౌలాలి, వీఆర్ఏలు పాలల్గొన్నారు.

## బాలంవారిపల్లె ప్రాజెక్టు నుంచి అయ్యప్పనాయుని చెరువు నింపడానికి మొరవను పరిశీలన



పీలేరు, డిసెంబరు 05 ప్రభాతవార్త:

బాలంవారిపల్లె ప్రాజెక్టు నుంచి నీటిని ఎర్రదొడ్డేరుపల్లె చెరువు, తుమ్మలపల్లె చెరువుకు పీలేరు అయ్యప్పనాయుని చెరువుకి నీరు నింపడానికి మొరవను పరిశీలిస్తున్న ఎంపీపీ సతీష్‌రెడ్డి, సర్పంచి జీనత్‌షఫీ, ఎంపీ పీఆర్వో ఉదయ్‌కుమార్, కాకులారంపల్లె సర్పంచి సురేష్‌రెడ్డి, ఏపీ టూరిజం మెంబరు షేక్ షాకీర్, వైసీపీ నాయకులు జావిద్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీహైస్కూల్ ప్రహరీగోడ కూలి దూడ మృతి



పీలేరు, డిసెంబరు 05 ప్రభాతవార్త:

మిచౌంగ్ తుఫాన్ కారణంగా ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో మండలంలోని మేళ్లచెరువు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు గోడ కిందకు నీరు చేరడంతో ప్రహరీగోడ కూలిపోవడంతో అక్కడే ఉన్న దూడ మీద పడడంతో దూడ అక్కడికక్కడే మతిచెందింది.

## ఈనెల 9లోపు ఓటర్ నమోదు చేసుకోవాలి

ఆర్డీఓ ఎంఎస్.మురళి



మదనపల్లె, డిసెంబర్ 5 ప్రభాతవార్త :

కొత్తగా ఓటర్ నమోదు చేసుకునేవారు ఈనెల 9లోపు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. మంగళవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన ఓటర్ల జాబితాకు సంబంధించి రాజకీయపార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ మార్పులు, చేర్పులకు సంబంధించి గడువు మూడు రోజులే ఉందన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌ఓలను సంప్రదించి ఓటర్ల జాబితాను సరిచూసుకొని కొత్తగా చేర్చుకునే వారు క్లైమ్‌లు సమర్పించాలన్నారు. అదే విధంగా సెక్టోరియల్ అధికారులు రాజకీయ నాయకులకు, ఓటర్లకు ఈవిఎంలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఓటర్ ఈవీఎంలపై అవగాహన పొంది ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న ముందస్తుగా తనకు సమాచారం ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో కమీషనర్ ప్రమీల, తహశీల్దార్ మహబూబ్‌చాంద్, మంజుల, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, ఆమ్ ఆద్మీ క్రిష్ణమూర్తి, బిజెపి భగవాన్, జనసేన జంగాల శివరామ్, టిడిపి ఆర్‌జె.వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## వర్షానికి దెబ్బతిన్న పంట

పోరుమామిళ్ల ,డిసెంబర్ 5 ప్రభాతవార్త :

మండలంలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు దాదాపు 200 ఎకరాలకు పైగా నష్టం వాటిల్లింది. మండలంలోని సిద్దవరం పంచాయతీకి చెందిన అగ్రహారం మంరియు కవలకుంట్ల, దాసరిపల్లె, ఎరసాల తదితర గ్రామాలలో గత రెండు రోజుల నుంచి పడుతున్న వర్షాలకు వరి, మొక్కజొన్న వంటి పంటలు నేలకొరిగాయి. ఒక ఎకరానికి దాదాపు 50 వేల రూపాయలు పెట్టుబడి వెచ్చించారు. తీరా పంట చేతికి వస్తున్న సమయంలో పంటలు నేలకొరిగాయన్నారు. అప్పు తెచ్చుకుని పంట సాగు చేసుకుంటే తీరా పంట చేతికి వచ్చినపుడు ఈ విధంగా అకాల వర్షాలతో పంట దెబ్బతినడంతో రైతాంగాన్ని కన్నీటికి గురిచేస్తుంద న్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం



పీలేరు, డిసెంబరు 5 ప్రభాతవార్త:

రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం వాల్మీకిపురం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరుమందికి రూ.11లక్షల చెక్కులను పేదలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరి చికిత్సలు పొందుతున్న వారి ఆరోగ్యం బాగు చేసుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి రూ.11లక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీకి చెందిన మహేష్‌నాయక్ కు రూ.2లక్షలు ఆర్థికసాయం, వాల్మీకిపురం మండలం ఓబులంపల్లెకి చెందిన శివశంకర్ కి రూ.2లక్షలు ఆర్థికసాయం, వాల్మీకిపురం పట్టణానికి చెందిన సదాశివనాయుడు రూ.2లక్షలు, కలకడ మండలం దొడ్డిపల్లెకు చెందిన జ్యోతిస్వరూప రూ.2లక్షలు ఆర్థికసాయం వాల్మీకిపురం పట్టణానికి చెందిన చరణ్‌తేజ ఆర్థికసాయం రూ.50వేలు, కలకడ మండల బాలనాగువారిపల్లెకు చెందిన సాయిమోహన్‌కు రూ.50వేలు ఆర్థికసాయం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## మైనారిటీ సోదరుల ఆత్మీయ సదస్సు



పీలేరు, డిసెంబరు 05 ప్రభాతవార్త:

స్థానిక తెదేపా కార్యాలయంలో బుధవారం అనుబంధ సంఘం ముస్లీం, మైనారిటీ సోదరుల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని తెదేపా జాతీయనేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈకార్యక్రమానికి రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వంలో అన్ని విధాల మోసపోయిన ముస్లీం, మైనారిటీల కోసం తెదేపా చేపట్టిన అభివద్ది సంక్షేమ వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ, ఆడబిడ్డల కోసం పెళ్లికానుక రంజాన్ తోఫా లాంటి మరిన్ని పథకాలతో తెదేపా ముస్లీం మైనారిటీల కోసం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముస్లీం సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాఖ్ అహ్మద్ అధ్యక్షతన జరగనున్నది కావున నియోజకవర్గ పరిధిలో గుర్రంకొండ, వాల్మీకిపురం, కలకడ, కేవి.పల్లె, కలికిరి, పీలేరు మండలాల వారిగా గ్రామ గ్రామాలలో ముస్లీం మైనారిటీ సోదరులు అదిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

## మిట్స్ విద్యార్థినిలు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



కురబలకోట, డిసెంబర్ 5 ప్రభాతవార్త :

అంగళ్ళు సమీపాన ఉన్న మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రణతి, దీపికాలు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచారు. ప్రొద్దుటూరులోని సాయిరాజేశ్వరీ ఇన్‌స్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారు నిర్వహించిన జాతీయస్థాయి పోటీలలో ప్రతిభ కనపరిచి రెండవ బహుమతి పొందినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. టెక్నొహలిక్ 2కె23లో నిర్వహించిన పోటీల్లో పేపర్ ప్రెజెంటేషన్ కంపిటీషన్‌లో ఈ ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులనుకళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఈడి కీర్తి నాదేళ్ల, విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్‌రాయ్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## వెలుగుస్కూల్‌లో అంతర్జాతీయ స్వచ్ఛందసేవకుల దినోత్సవం




మదనపల్లె, డిసెంబర్ 5 ప్రభాతవార్త :

అమ్మచెరువుమిట్ట సమీపంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వెలుగు స్కూల్ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, గ్రామజ్యోతి సొసైటి అధ్యక్షులురాలు సుబద్ర అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1985లో డిసెంబర్ 17న చేసిన తీర్మాణం ద్వారా ప్రతి ఏటా డిసెంబర్ 5న అంతర్జాతీయ వాలంటీర్‌డే పర్ ఎకనామికల్ సోషల్ డెవలప్‌మెంటును పాటించాల్సిందిగా వివిధ ప్రభుత్వాలకు పిలుపునిచ్చిందన్నారు. ఇందులో భాగంగానే అంతర్జాతీయ స్వచ్ఛందసేవా సేవకుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన నాయకులు వివిఎస్.రెడ్డి,భాగ్యలక్ష్మి, లీనాకుమారి, ఈశ్వరయ్య, ఆనంద్, సుబ్రమణ్యం, చంద్రశేఖర్, మోహన్, ఇంద్రకుమార్, భారతి, మమత తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

నిమ్మనపల్లె, డిసెంబర్ 5 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలం గంగాపురంపల్లెలో నాటుసారా అమ్ముతూ చిన్నరెడ్డప్ప(55)ను అరెస్టు చేసి అతని వద్దనుంచి 12లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకొన్నామన్నారు. అదే విధంగా అరిపిరెడ్డిగారిపల్లె వద్ద సారాయి అమ్ముతున్న అదే గ్రామానికి చెందిన సుహాసిని(30)ను అరెస్టు చేసి ఆమె వద్దనుంచి 20లీటర్లు సారాను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

## నేడు కులగణన రౌండ్ టేబుల్ సమావేశం

ములకలచెరువు, డిసెంబర్ 5 ప్రభాతవార్త :


ములకలచెరువు ఎంపిడిఓ కార్యాలయంలో నేడు ముఖ్యమంత్రి జగన్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కులగణన నరౌండుటేబుల్ సమావేశం ఎంపిడిఓ, తహశీల్దార్ అద్యక్షతన సమావేశం ఉదయం 11గంటలకు నిర్వహించబడుతుందన్నారు. ఈ సమావేశానికి జడ్పిటిసి సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లున, అన్ని కులసంఘాల నాయకులు, పంచాయితీ కార్యదర్శులు, విఆర్‌ఓలు, వేల్పేర్ అసిస్టెంట్స్ హాజరు కావాలని ఎంపిడిఓ అశ్విని తెలిపారు.

## శబరిమలకు బయల్దేరి వెళ్లిన అయ్యప్ప స్వాములు

ఖాజీపేట, డిసెంబర్ 5ప్రభాతవార్త:

శబరిమల అయ్యప్ప స్వామి ఆదర్శకం కోసం ఖాజీపేట మండల పరిధిలోని రావులపల్లె సుంకేసుల ఖాజీపేట గ్రామస్తుల అయ్యప్ప స్వామి భక్తులు ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయల్దేరారు. ఖాజీపేట నుంచి 30 మంది అయ్యప్ప స్వామి భక్తులు గురుస్వాములు సుబ్బారావు, రాఘువరెడ్డి అయ్యప్పస్వామి భక్తులకు ఇరుముడిలు కట్టారు. అయ్యప్ప స్వామి భక్తులు 41 రోజుల కఠినమైన దీక్షను పూర్తి చేసుకొని కేరళలోని పంపానది తీరాన వెలసిన అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు బయల్దేరి వెళ్లారు.

## అందమైన హిల్‌స్టేషన్‌లకు కేరాఫ్ చండీగడ్



చండీగఢ్ నగరం విభిన్న వారసత్వం, సంస్కృతి, ఆహారపు సమ్మేళనం. ఈ ప్రాంతం ఉద్యానవనాలు, స్మారక కట్టడాలకు ఎంతగానో ప్రసిద్ధి చెందింది. వారాంతపు సెలవుల్లో సందర్శించేందుకు చండీగఢ్ ఎంతో ఉత్తమమైన ప్రదేశం. ఇక్కడి హిల్ స్టేషన్‌లు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. చండీగఢ్ చాలా అందమైన నగరం. ఇక్కడ నివసించడానికి చాలామంది ఇష్టపడుతారు. అందమైన తోటలు, సరస్సులు, జలపాతాలు, పచ్చదనం నిండిన అనేక అద్భుతమైన ప్రదేశాలకు ఈ ప్రాంతం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఈ నగరం పరిసరాల్లో కొన్ని అందమైన హిల్ స్టేషన్లు ఉన్నాయి. చండీగఢ్ సమీపంలోని హిల్ స్టేషన్‌లను లాంగ్ వీకెండ్‌లో చుట్టేయొచ్చు. మరెందుకాలస్యం బయలుదేరండి..

**బరోగ్‌జి :** నగర జీవితపు ఒత్తిడి నుండి తప్పించుకోవాలంటే ఛండీగడ్‌లోని బరోగ్ హిల్‌స్టేషన్‌ను సందర్శించాల్సిందే. బరోగ్ హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్ జిల్లాలో ఉంది. చండీగఢ్ నుండి బరోగ్ సుమారు అరవై కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ప్రాంతంలో అనేక హోటల్స్, రిసార్ట్‌లు కూడా ఉన్నాయి. ఈ హిల్‌స్టేషన్ ట్రెక్కింగ్ ప్రియులకు, ప్రకృతి ప్రేమికులకు ఎంతగానో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఫారెస్ట్ వాక్ వంటికి కూడా చేయొచ్చు. వీకెండ్స్‌లో ఇక్కడ పర్యాటకుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఇక్కడి పర్వత శిఖరాలను నేరుగా తాకుతున్న అనుభూతి పర్యాటకులకు కలుగుతుంది.

**చైల్‌జి:** చైల్ హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్ జిల్లాలో ఉన్న మరొక అందమైన హిల్ స్టేషన్. ఈ హిల్‌స్టేషన్ చండీగడ్‌కు సమీపంలో ఉంది. ఒకప్పుడు ఈ హిల్ స్టేషన్ మహారాజా భూపేంద్ర సింగ్ రాజధానిగా ఉండేది. అతను వేసవి సెలవుల్లో ఇక్కడికి వచ్చేవారని ఇక్కడివారు నమ్ముతారు. చుట్టూ పచ్చని ప్రకృతి అందాలతో ఈ ప్రాంతం పర్యాటకులను కనువిందు చేస్తుంది. ఈ ప్రదేశం విశ్రాంతి తీసుకునేందుకు వారాంతాల్లో కుటుంబంతో కలిసి సరదాగా గడిపేందుకు ఎంతో అనువైనది. చండీగఢ్ నుండి ఇక్కడికి సుమారు 104 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

**కసౌలిజి:** హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలి హిల్‌స్టేషన్ కూడా వారాంతల్లో సందర్శరించేందుకు ఒక అద్భుతమైన ప్రదేశం. ఇక్కడ బ్రిటీష్, మొఘల్ పాలనపు అనేక చారిత్రక వారసత్వాన్ని చూడొచ్చు. సెలవులను ప్రశాంతంగా ఆస్వాదించాలనుకునేవారు తప్పకుండా కసౌలిని సందర్శించొచ్చు. కసౌలి హిల్ స్టేషన్లోని అతి ముఖ్యమైన ఆకర్షణ మంకీ పాయింట్. దీని చుట్టూ హార్స్ చెస్ట్‌నట్ మరియు హిమాలయన్ ఓక్ అడవులు ఉన్నాయి. ఈ ప్రదేశం పిల్లలకు చూపించడానికి సరైనది. చండీగఢ్ నుండి కసౌలికి రెండు గంటల్లో చేరుకోవచ్చు. అలాగే, ఢిల్లీ నుండి కసౌలికి ఆరు గంటల్లో చేరుకోవచ్చు.

**మోర్ని హిల్స్:** చండీగడ్ కు సమీపంలో మోర్ని కొండలు వారాంతాల్లో సందర్శంచేందుకు ఎంతో అనువైన ప్రదేశం. ప్రకృతిసిద్ధమైన ఆహ్లాదాన్ని పొందేందుకు ఈ ప్రదేశం ఎంతో ఉత్తమమైనదని చెప్పుకోవచ్చు. కుటుంబంతో, స్నేహితులతో కలిసి విహరించేందుకు ఈ ప్రాంతం మంచి ఎంపిక. ఇక్కడి కొండపై ఉన్న పట్టణ అందాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. విభిన్నమైన వృక్షసంపద, జంతుజాలాలకు ఈ ప్రాంతం ప్రసిద్ధిచెందింది. చండీగఢ్‌కు సమీపంలో ఉన్న ఉత్తమ హిల్ స్టేషన్ ఇది. ఇక్కడ బోటింగ్, బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్ వంటి కార్యకలాపాలు అందుబాటులో ఉన్నాయి.

## 16న బహుజన సమాజ్ పార్టీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

బద్వేల్ అర్బన్, డిసెంబర్ 5 ప్రభాతవార్త :




బహుజన సమాజ్ పార్టీ బద్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు నుసిమి గౌస్ పీర్ ఆధ్వర్యంలో బహుజన సమాజ్ పార్టీ ఆఫీస్ నందు మంగళవారం పలువురు నాయకులతో అత్యవసర నియోజకవర్గ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప జిల్లా ఇన్చార్జ్ సగిలి గురప్ప, జిల్లా అధ్యక్షులు డిఎస్ జయరాం, ఉపాధ్యక్షులు బాలచంద్ర హాజరైనారు, అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో జిల్లా ఇంచార్జ్ సగిలి గుర్రప్ప మాట్లాడుతూ అతి భారీ తుఫాన్ వలన డిసెంబర్ 6 వ తారీకు బద్వేల్ తాలూకా పోరుమామిళ్ల లో జరగాల్సిన బహుజన రాజ్యాధికార చైతన్య సభ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వాయిదా వేయడం జరిగిందన్నారు, కావున తిరిగి బహుజన రాజ్యాధికార చైతన్య సభ ఈ నెల డిసెంబర్ 16వ తారీకు శనివారం సాయంత్రం నాలుగు గంటలకు యధావిధిగా నిర్వహించడం జరుగుతుందన్నారు కావున బద్వేల్ తాలూకా బహుజన మేధావులు బహుజన విద్యావేత్తలు బహుజన ఉద్యోగస్తులు బహుజన యువకులు బహుజన మహిళలు బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తలు అభిమానులు అందరూ గమనించగలరని పలువురికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు, డిసెంబర్ 16న జరగబోవు సమావేశానికి నియోజకవర్గం స్థాయిలోని పలువురు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏసోబు, కార్యనిర్వాహణా కార్యదర్శి రామ లక్ష్మయ్య పోరుమామిళ్ల మండల అధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ముస్లిం మైనార్టీ ఆత్మీయ సమావేశానికి తరలిరండి



బి.కొత్తకోట, డిసెంబరు 5, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ ఆదేశాల మేరకు ఈనెల 9వ తేదీన బి.కొత్తకోట మండల కేంద్రంలో తెదేపా ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం జరుగుతుందని నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు నూర్ బాషాలు తరలిరావాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జయశంకర్ యాదవ్‌తో పాటు రాష్ట్ర తెదేపా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ముస్తక్ మౌలానా, రాష్ట్ర తెదేపా ముస్లిం మైనార్టీ మాజీ అధ్యక్షుడు అమీర్‌బాబు, రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర తెదేపా కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, నూర్ బాషా సంఘ నాయకులు రిటైర్డ్ ఎస్పీ షేక్షావలీ పాల్గొంటారని నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు, నూర్ బాషాలు తప్పక హాజరుకావాలని కోరారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదనిర్వాహ కార్యర్శి పర్వీన్‌తాజ్, మైనార్టీ సెల్ కార్యదర్శి మస్తాన్, షమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ఘన స్వాగతం



బి.కొత్తకోట, డిసెంబరు 5, ప్రభాతవార్త:

బి.కొత్తకోట మండలంలో వికసిత్ భారత సంకల్పయాత్ర రథానికి స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం వేమిలేటి కోట గ్రామ పంచాయతీ మధ్యాహ్నం వలసగుట్టపల్లి పంచాయతీలలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి సంక్రమించిన అభివృద్ధి పథకాలను శాఖల వారీగా అధికారి యంత్రాంగం సభకు వివరించారు. అనంతరం దేశ ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని అధికారులు గ్రామసభలోని అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాలీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రామసముద్రం, డిసెంబర్ 5 ప్రభాతవార్త :



మండలంలోని ఆర్‌నడింపల్లి పంచాయితీ వాలీశ్వరస్వామి కొండపై వెలిసిన వాలీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారుర. స్వామికి పలు రకాల పుష్పాలతో అలంకరణలు నిర్వహించి అర్చకులు లోకనాథం, మణికంఠలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి



రాయచోటి, డిసెంబరు 5, ప్రభాతవార్త:

కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో డిసెంబరు 10న జరిగే రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా జేఏసీ ఛైర్మన్ కె.చంద్రశేఖర్, వైస్ ఛైర్మన్ ఎం.రామమూర్తి నాయక్‌లు అన్నమయ్య జిల్లా రాయచోటిలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు, సభ్యులతో కలిసి రాష్ట్ర మహాసభ కార్యాచరణ సమావేశాన్ని మహిళా సమాఖ్య కేంద్రంలో నిర్వహించారు. మహాసభకు సంబంధించి పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలను రద్దు చేసి ఆప్కాస్ అనే సంస్థ ద్వారా ఉద్యోగ భద్రతను కల్పించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మా ఉద్యోగులందరి తరుపున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుమన్, జనరల్ సెక్రటరీ అల్లం సురేష్ ఆధ్వర్యంలో ఏదీనికి అనుబంధంగా ఉన్న 94 సంస్థలు కూడా మనకు సంపూర్ణ మద్దతు ప్రకటించామన్నారు. మహాసభ కార్యక్రమానికి ప్రభఉత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు మాలాద్రి విష్ణు కూడా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పద్మనాభం, సభ్యులు రమా మోహన్‌రెడ్డి, శాంతి, జేమ్స్‌పాల్, రెడ్డప్ప, కల్యాణ్‌కుమార్‌రెడ్డి, శంకరయ్య, శ్రీను, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వరద గ్రామాలను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు



ఓబులవారిపల్లె, డిసెంబరు 5, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలంలోని మిచౌంగ్ తుపాను కారణంగా కొర్లకుంట గ్రామంలో మంగళవారం గంగాధర్ నెల్లూరు జిల్లా ఎన్నికల పరిశీలకులు సాయికిశోర్‌రెడ్డి ఇళ్లలోకి నీరు రాకుండా చెరువును వచ్చిన బాధితులను పరామర్శించారు. పండ్ల తోటలను పరిశీలించి తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తతీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అధికారులు, పంచాయతీ సెక్రటంరీ శివ తదితరులు పాల్గొన్నారు.

## కరువు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పెండ్లిమర్రి, డిసెంబరు 5, ప్రభాతవార్త:



గోరుచుట్టు మీద రోకటి పోటులా కరువుతో సతమతం అవుతున్న రైతులను అకాల వర్షం ముంచెత్తింది. మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలంలోని పాత సంగటిపల్లి గ్రామంలో పత్తి, మినుము పంటలను పరిశీలించారు. పత్తి పంట దాదాపు 100 ఎకరాలు, 120 ఎకరాలు మినుము పంట దెబ్బతిన్నట్టుగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం తక్షణమే పరిశీలించి అన్‌పుట్ సబ్సిడీ ఇన్సూరెన్స్ వర్తించేలా కృషి చేయాలని కేంద్ర కరువు బృందం వైఎస్ఆర్ జిల్లాలో పర్యటించారు. దెబ్బతిన్న వివిధ పంటలను పరిశీలించాలని రైతులకు న్యాయం చేయాలని నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ తరుపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కమలాపురం అసెంబ్లీ సమన్వయ కమిటీ కన్వీనర్ విష్ణుప్రీతంరెడ్డి, కమలాపురం అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యులు పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, పీసీసీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మహ్మద్ పఠాన్ అలీఖాన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ల బాబు, సిటీ మహిళా ఉపాధ్యక్షురాలు లావణ్య, మానవ హక్కుల విభాగం జిల్లా అధ్యక్షులు శివ మహేంద్రరెడ్డి, సుబ్బిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామ పాదపూజ అక్షింతల ఊరేగింపు



దువ్వూరు, డిసెంబరు 5, ప్రభాతవార్త:

అయోధ్యలో వచ్చే నెల శ్రీరామ మందిరం ప్రారంభం అవుతుండగా మండల కేంద్రమైన దువ్వూరులో మంగళవారం శ్రీరామ పాదపూజ అక్షింతల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత నెలలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు రామాలయంలో భద్రపరిచారు. నిర్వాహకుల ఆదేశాల మేరకు మంగళవారం రామాలయంలోని అక్షింతలను మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ చంద్ర పటాన్ని ముందు వచ్చి అక్షింతలతో ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, చెక్కబజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అక్షింతలు ఊరేగింపు సందర్భంగా దువ్వూరు కోలాహలంగా కనిపించింది. భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు.

## ముమ్మరంగా పెట్రోలింగ్


ప్రొద్దుటూరు క్రైం, డిసెంబరు 5, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు పట్టణంలో మంగళవారం 3వ పట్టణ సీఐలు యుగంధర్, వెంకటరామన్‌లు తమ సిబ్బందితో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు, వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సహదేవరెడ్డిని పరామర్శించిన రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, డిసెంబరు 5, ప్రభాతవార్త:



మండలంలోని హసనాపురం పంచాయతీ కొండవాండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు నర్సుపల్లి సహదేవరెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో కాలు ఆపరేషన్ చేయించుకొని అనారోగ్యంతో బాధపడుతున్న విషయం రాయచోటి నియోజకవర్గం టీడీపీ నాయకుడు మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం సహదేవరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగిన సంఘటన గురించి ఆయన అన్న ఉపాధ్యాయుడు నర్సుపల్లి పిచ్చిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, వాసుదేవరెడ్డి, అన్నయ్య భాస్కర్‌రెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి, ముత్తు పాల్గొన్నారు.

## బైక్ దొంగలు అరెస్టు

### 7 ద్విచక్రవాహనాలు స్వాధీనం : పోలీసులను అభినందించిన డిఎస్పీ

బద్వేలు ,డిసెంబర్ 5 ప్రభాతవార్త :



పట్టణంలోని అనేక ప్రాంతాలలో బైక్ చోరీలకు పాల్పడిన అంతరాష్ట్ర దొంగలను బద్వేలు పోలీసులు అరెస్టు చేశారు. రాబడిన సమాచారం మేరకు సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో నేడు తెల్లవారుజామున నందిపల్లె బ్రిడ్జి వద్ద పొదలలో ఉన్న ఇద్దరు అంతరాష్ట్ర బైక్ చోరీలకు పాల్పడిన దొంగలను అరెస్టు చేశారు. ఈమేరకు డీఎస్పీ వంశీధర్ గౌడ్ మాట్లాడుతూ పట్టణంలో 7 ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయని వాటిని ప్రొద్దుటూరుకు చెందిన భరత్‌కుమార్ , మైదుకూరుకు చెందిన జగన్నాథ్ అశోక్ అనే ఇరువురు చోరీలకు పాల్పడ్డారు. వీరిని సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఐడీపార్టీ పోలీసులు ప్రత్యేక దృష్టిపెట్టి అరెస్టు చేయడం జరిగిందన్నారు.

## మండల అధ్యక్షుల జాబితా విడుదల చేసిన డీసీసీ

– డీసీసీ అధ్యక్షుడు షేక్ అల్లాబకాష్



రాయచోటి, డిసెంబరు 5, ప్రభాతవార్త:

రాయచోటి అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలోని మొత్తం 36 మండలాలకు నియమితులైన మండల అధ్యక్షుల జాబితాను మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు షేక్ అల్లాబకాష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో మండల అధ్యక్షులు పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. 2024లో జరగబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్యాడర్లున్న లేకున్నా కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులందరూ రాహుల్ గాంధీని ప్రదానిని చేయాలని లక్ష్యంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమలో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు కత్వాల్ మహ్మద్ రఫీ, జిల్లా డీసీసీ మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ రఫీ, జిల్లా డీసీసీ మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీఖాన్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్నకృష్ణ, జిల్లా మీడియా ఛైర్మన్ నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు దర్బార్ ఆఫ్రిన్, రాయచోటినియోజకవర్గం మండల అధ్యక్షులు రమణ, నూరుల్లా, వెంకట సుబ్బయ్య, చంద్రశేఖర్, ఖాదర్ ఖాన్, నాగరాజు, ముస్తాక్ శంకర్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## బొందలకుంటలో అట్టహాసంగా ప్రపంచ నేల దినోత్సవం కార్యక్రమం

జమ్మలమడుగు, డిసెంబరు 5, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలోని బొందలకుంట ఆర్బీకేలో ప్రపంచ నేల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భారత దేశంలోని భారత పౌరులుగా మట్టిని కాపాడుకొని బంగారు మట్టిని భావి పౌరులుగా పంచాలని కోరారు. మంగళవారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి చోటా ప్రపంచ నేల దినోత్సవం కార్యక్రమం జరుపుకుంటారని తెలిపారు. నిజంగా రాబోయే కాలంలో వ్యవసాయం చేసే యువ రైతాంగానికి నేలను సంరక్షించి, సారవంతం గల బంగారు మట్టిని అందరూ పంచి ఇవ్వాలని కోరారు. ఈ రోజు ప్రతి ఒక్కరూ తమ వ్యవసాయ భూముల్లో అనేక రకాల రసాయనిక ఎరువులు వాడి అలాగే క్రిమి సంహారక మందులు పిచికారి చేయడం వల్ల నేల మొత్తం నిస్సారవంతంగడా తయారై దిగుబడులు పూర్తిగా తగ్గిపోయి అంతిమంగా రైతుకు నష్టాలు వస్తున్నాయని తెలిపారు. ఇటువంటి తరుణంలో ప్రతి పౌరుడు మనం నివసిస్తున్న ప్రదేశంలో ఉన్న మట్టిని కాపాడి సంరక్షించి రాబోయే యువ తరానికి నాణ్యమైన మంచి సారవంతం నేలను ఆస్తిగా పంచి ఇవ్వాలని రైతులకు తెలిపారు. ఇందుకు క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు మొదలుకొని అంతిమంగా ఉన్నతాధికారుల వరకు కూడా రైతులు మంచి నేలను సంరక్షించే విధంగా సలమాలు, సూచనలు అందించాలని వారిని తీర్చి దిద్దాలని కోరారు. ప్రతి ఒక్కరూ నేల తల్లిని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకట రామిరెడ్డి, రామసుధ, రామ భూపాలుడు, ఆర్బీకే సిబ్బంది, వెంకట రమణ, ప్రశాంత్‌లు ప్రపంచ నేల దినోత్సవం గురించి మాట్లాడి వారి అనుభవాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకట లక్ష్మి, శ్రీనివాసరెడ్డి, మరియు ఆర్బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు ప్రభుత్వ సంక్షమే పథకాలు

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె, డిసెంబర్ 5 ప్రభాతవార్త :



గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయడంజరిగిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. మంగళవారం రూరల్ మండలంలోని కొండామ్రిపల్లె సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న నవరత్నాల బుక్‌లెట్‌ను గడప గడపకు తీసుకెళ్లి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పేదల సంక్షేమం కోసం పథకాలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ ఆశీర్వదించాలంటూ ఆయన కోరారు. అనంతరం కొత్తవారిపల్లె -1 సచివాలయ పరిధిలో వైఏపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సచివాయలంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్ఆర్ పార్టీ జండాను ఆవిష్కరించారు. అనంతరం మున్సిపాలిటిపరిధిలోని అప్పారావుతోట 19వ వార్డులో, ఇందిరానగర్‌లో జరిగిన వైఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైకాపా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ప్రమీల, వివిధశాఖల ఉద్యోగులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

– మండల కన్వీనర్ యదుభూషణ్‌రెడ్డి

గాలివీడు, డిసెంబర్ 5(ప్రభాతవార్త):

ప్రజాసంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని మండల వైకాపా కన్వీనర్, వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. గాలివీడు సచివాలయం-3 పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంఈపపీ యదుభూషణ్‌రెడ్డి పాల్గొని కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగన్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించారు. నాలుగన్నరేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి పథకాల ద్వారా రాష్ట్రాన్ని సీఎం జగన్ ప్రగతిపథంలో నిలపడాన్ని ప్రజలకు వివరించారు. ఆయా గ్రమాలకు చేసిన మంచిని గణాంకాలతో సహా వెల్లడించారు. సుపరిపాలన కొనసాగాలంటే సీఎం జగన్‌ను ఆశీర్వదించి మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్‌నాయక్, మండల జేసీఎస్ కన్వీనర్లు ఖాదర్‌మొహిద్దీన్(ఎస్‌కే), వెంకటరెడ్డి, ఎంపీడీఓ శేఖర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు సురేష్‌కుమార్, శివానాయక్, వీఆర్‌ఓ అల్లాబక్ష్, మాజీ ఎంపీటీసీ కృష్ణ, సచివాలయ కన్వీనర్ సుబ్బారెడ్డి, వైకాపా నాయకులు ఆదినారాయణరెడ్డి, వెంకటయ్య, గేట్‌నాయుడు, వినోద్, సూరి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## అరటి పంట నష్టాన్ని త్వరగా మంజూరు చేయండి

పంతగాని నరసింహప్రసాద్

రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త



గత 3 రోజుల క్రితం నుండి విపరీతమైన భారీ వర్షంతో వందలాది హెక్టార్లలో పూర్తిస్థాయిలో అరటి పంట నష్టమైన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్, రాఘవరాజపురం, ఉర్లగట్టుపోడు తదితర ప్రాంతాల్లో రైతులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రైతు ప్రభుత్వం అంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే నష్టపో యిన రైతులకు ఆర్థిక సహాయం, ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేసి ఆదుకోవాలని ఆయన అన్నారు. తమ నాయకుడు తెలుగుదేశంపార్టీ జాతీయ నేత నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి రైతుల పక్షాన పోరాటం చేస్తామని పంతగాని అన్నారు. పూర్తిస్థాయిలో పంటనష్టాన్ని మంజూరు చేసి ఆదుకోవాలని పంతగాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్, సూర్యప్రకాష్‌నాయుడు, అమర్, కూని చంద్రయ్య, దినేష్, రాఘవరాజపురం, ఉర్లగట్టుపోడుకు చెందిన అరటి రైతులు పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా గోవిందుని కల్యాణం



కడప వైద్యవిభాగం, డిసెంబరు 5, ప్రభాతవార్త:

శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం, ఆ గోవిందుని కళ్యాణం స్థానిక నేక్ నామ్ కళాక్షేత్రంలో సోమవారం అంగరంగ వైభవంగా కన్నుల పండువగా జరిగింది. గోవింద మాల భక్త బృందం నిర్వాహకులు ఎస్.శ్రీనివాసులురెడ్డి, రామంజనేయులు, రమణారెడ్డి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. కళ్యాణోత్సవంలో భాగంగా ఉదయం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీకోదండ రామాలయం నుంచి ధర్మకర్త బి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 108 మంది ముత్తైదువులు పుణ్య జలాలు గల కలశాలను ధరించి ఊరేగింపుగా కళాక్షేత్రానికి తీసుకురావడం జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిని వధూవరులుగా అలంకరించి వేదికపై గల పెళ్లి పీటలపై కొలువు తీర్చారు. పలు పూజలు అనంతరం కళ్యాణ స్తూపాన్ని నిర్వహించారు. గోవింద మాల భక్తులు నగర ప్రముఖులు విశేష సంఖ్యలో హాజరై కళ్యాణమూర్తులను దర్శించుకున్నారు. మహిళా భక్తులు భక్తి గీతాలు కోలాటాలు చేస్తూ అందర్నీ ఆకట్టుకున్నారు. నిర్వాహకులు భక్తులందరికీ భోజన సౌకర్యం కల్పించారు.

## అరటి రైతుకు ఎకరాకు 30 వేలు పరిహారం ఇవ్వాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు డిమాండ్



రాజంపేట అర్బన్, డిసెంబరు 5 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లాలో 10 వేల ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయని, ఎకరాకు అరటి రైతుకు 30 వేలు పంట నష్టపరిహారం చెల్లించాలని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మేడావారిపల్లె, కొమ్మివారిపల్లె తదితర గ్రామాల్లో ఆయన పంటనష్ట పరిహారాన్ని పరిశీలించారు. మేడావారిపల్లెలో నరసింహరాజు అరటితోట పడిపోయిన తీరు చూస్తే కన్నీరు వస్తుందని, కనుచూపు మేరలో అరటి తోట మొత్తం ఎవరో నరికివేసినట్లు తుఫాను గాలుల తాకిడికి నేల కూలిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు జిల్లాలో 75 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో అరటి, బొప్పాయ ఉద్యాన పంటలు సర్వనాశనం అయ్యాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులను ఉదారంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హెక్టారుకు 25 వేలు ఏ మూలకు సరిపోదని పేర్కొన్నారు. ఎకరా పంట సాగు చేయాలంటే అరటి రైతుకు లక్ష ఖర్చు అవుతుందని, పంట దెబ్బతింటే 10 వేలు ఇస్తే ఏ మూలకు వస్తుందని ప్రశ్నించారు. దెబ్బతిన్న పంటలను సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పరిశీలించినా పాపాన పోలేదని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అరటి రైతులను ఆదుకోకపోతే రైతుల గోడుతో మిచౌంగ్ తుఫానులో జగన్‌సర్కార్ కొట్టుకుపోతోందని వ్యాఖ్యానించారు. ఆకేపాడు, హస్తవరం, శవనవారిపల్లె, చెర్లోపల్లె గ్రామాల్లో జగన్‌రాజుతో పాటు రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, పార్టీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, మాజీ జిల్లా అధ్యక్షులు పత్తిపాటి కుసుమకుమారి, మండల కమిటి అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్యానాయుడు, ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, సిద్దవటం మాజీ జడ్‌పిటిసి చలమయ్యయాదవ్ పాల్గొన్నారు.

## అధైర్యం వద్దు.. రైతన్నలూ ప్రభుత్వం చేయూత

అన్నమయ్య జిల్లా కలెక్టర్ పిఎస్ గిరీషా

రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త

అన్నదాతలూ... అధైర్యం వద్దు. ప్రభుత్వం ఉందని, నష్టపోయిన ప్రతి అరటిరైతుకు ప్రభుత్వం చేయూతనిస్తుందని అన్నమయ్యజిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ అన్నారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని కెఆర్ కండ్రిక, రాఘవరాజపురం, అనంతరాజుపేట, సూరపురాజుపల్లె తదితర గ్రామీణ ప్రాంతాల్లో పడిపోయిన అరటి పంటను రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులతో పరిశీలించారు. ఈ సందర్భంగా మిచౌంగ్ తుఫాను ద్వారా అరటిపంట భారీఎత్తున నష్టం జరిగిందని, అయితే సంబంధిత రెవెన్యూ వారి ద్వారా పంటనష్టాన్ని సమీకరించి రైతుల వివరాలను సేకరించి తప్పక అరటి రైతులకు భరోసా ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో అరటి పంట నష్టాన్ని తప్పక రైతులకు మేలు జరిగే విధంగా సహకరిస్తామని అన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, చిట్వేలి మండలాల్లో అరటి పంట తీవ్రంగా నష్టపోయిందని, అయితే నష్టపోయిన ప్రతిరైతుకు పూర్తిస్థాయిలో మేలు చేసేవిధంగా కృషి చేస్తామని ఎవరూ దిగాలు చెందాల్సిన అవసరం లేదని అన్నారు. బుడుగుంటపల్లె, కెఆర్ కండ్రిక, విపిఆర్ కండ్రిక, అనంతరాజుపేట ప్రాంతాల్లో రెవెన్యూ సిబ్బంది ద్వారా పూర్తిగా పంటనష్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పంటనష్టాన్ని మంజూరు చేయిస్తానని స్వయంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ పరిశీలించడం రైతులకు ఎంతో ఊరటనిచ్చిందని ప్రతిరైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి, జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ, రైల్వేకోడూరు ఉపసర్పంచ్ తోట శివసాయి, తహశిల్దారు రామ్మోహన్, డిటి అమరేశ్వరి, ఆర్ఐ రాజశేఖర్, సుధాకర్‌రాజు, మార్కెట్‌కమిటి ఛైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు, సూరపురాజుపలె సర్పంచ్ దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, బుడుగుంటపల్లె సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, యజ్ఞం చంద్రశేఖర్, ఉర్లగట్టుపోడు సర్పంచ్ గోపి, సర్పంచుల సంఘం అధ్యక్షులు నాయిని హరిక్రిష్ణారెడ్డి, పంచాయతిరాజ్ డిఇ బాలనరసింహులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి రమేష్, ఎంపిడిఒ జాషువా, ఇఒ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి పథకాలను ప్రజల్లోకి



రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త

దేశ ప్రధాని నరేంద్రమోడి ఇటీవల ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని 5 మండలాల్లో చాటి చెబుతామని పి.సురేష్, జయప్రకాష్ నారాయణవర్మలు అన్నారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పడిపోయిన అరటి పంటను పరిశీలించి పట్టణంలోని పంచాయతి కార్యాలయంలో ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన పథకాల పట్ల ఎల్ఇడి స్కీం ద్వారా మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా జన్‌ధన్, పిఎం కిసాన్, తక్కువ ధరకు గ్యాస్ సిలిండర్ తదితర పథకాలను ప్రజలకు ఎల్ఇడి స్కీం ద్వారా చూపించారు. కార్యక్రమంలో జయప్రకాష్‌నారాయణవర్మ, మస్తానయ్య, రైల్వేకోడూరు అసెంబ్లి ఇన్‌ఛార్జి గడ్డం చెంగల్‌రాజు, వాకచర్ల సుబ్బారావు, గడికోట సాంబశివ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతునికి విశేష పూజలు

బద్వేల్ అర్బన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:



కార్తీక మాసం పురస్కరించుకుని పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం అభయ ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం ఆకు పూజ సింధూరం అర్చన తో పాటు పలు రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది, ప్రత్యేక అభిషేక%శీ% ఉభయ దాతలుగా తుమ్మల పెంట సురేష్ బాబు సతీమణి జయప్రదా దేవి, సుబ్బ రాజు సతీమణి పార్వతమ్మ కుటుంబ సభ్యులకు ఆలయ పూజారి వీరేశచార్యులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు, కార్తీక మాసం సందర్భంగా తెల్లవారుజాము నుండి ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు కార్తిక దీపాలు వెలిగించి స్వామివారికి కాయ కర్పూరం సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు, ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మాడ పూరు వెంకటరమణ మరియు భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆడదాం ఆంధ్ర క్రీడలకు ఆన్‌లైన్ చేసుకోండి : ఎంపీడీవో

రామాపురం, డిసెంబరు 5, ప్రభాతవార్త:

ఆడదాం ఆంధ్ర క్రీడలకు ఈనెల 15వ తేదీ లోపు యువతతీ యువకులు ఆయా గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలని ఎంపీడీవో హైదరవల్లీ, ఈవోపీఆర్డీ ఉషారాణి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు ఈనెల 15 నుంచి ఫిబ్రవరి వరకు క్రీడలు ఆయా గ్రామ మండల, తాలూకాలలో క్రీడలు నిర్వహిస్తారన్నారు. ఇప్పటి వరకు 70% క్రీడలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నామన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహిస్తారన్నారు. ఈ క్రీడలకు 15 సంవత్సరాలు పైబడిన పురుషులు, మమిళలు ఆన్‌లైన్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్ క్రీడలకు బాధ్యత వహించాలన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

దువ్వూరు, డిసెంబరు 5, ప్రభాతవార్త:



ప్రభఉత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పెద్దజొన్నవరం గ్రామంలో వై నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దజొన్నవరానికి సుమారు రూ.18కోట్లు ప్రజలకు అందాయని ఇందులో వైఎస్ఆర్ రైతు బరోసా, ఆసరా, చేయూత, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా తదితర పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించారు. తెదేపా ప్రభుత్వంలో ప్రజలను అన్ని రకాల మోసం చేశారని ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. జగన్ అన్ని హామీలు అమలు చేసి తిరిగి వస్తున్నారని ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ శంకర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, సర్పంచ్‌లు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సుండుపల్లె ఎస్సై రామకృష్ణారెడ్డిపై కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు

రాయచోటి రూరల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:



సుండుపల్లి మండలం మిట్టమీదపల్లెలో ఒక కుటుంబానికి సంబంధించిన చింతచెట్టు వేప చెట్లను సుండుపల్లె ఎస్సై రామకృష్ణారెడ్డి దగ్గరుండి నరికించి తమ ఇంటి జాగాలో నుంచి పబ్లిక్ రస్తాను వేయించాడని బాధితుడు రాయచోటి కోర్టులో మంగళవారం ప్రైవేటు కేసు దాఖలు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సుండుపల్లె మండలం రాయవరం గ్రామం మిట్టమీదపల్లెకు చెందిన పెద్దివీటి శివకుమార్ కుటుంబం తరతరాలుగా మిట్టమీదపల్లెలో నివాసం ఉన్నది. శివకుమార్ ఇంటికి పక్కనే మాండవ్యనది నుంచి పల్లెలో ఉన్న శివాలయం వరకు కృష్ణదేవరాయలు కాలంలో నిర్మించిన 40 అడుగుల వెడల్పు గల పబ్లిక్ రస్తా ఉంది. బద్రి రమేష్ బద్రి వెంకటరమణ అనే వ్యక్తులు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆదేశాల తో సుండుపల్లె ఎస్సై అండ చూసుకొని పబ్లిక్ రస్తాను ఆక్రమించి అడ్డంగా గోడ నిర్మించి రస్తా స్థలాన్ని ఆక్రమించి గ్రామస్థులకు దారి లేకుండా చేశారు. అనంతర రస్తా పక్కనే గల పెద్దవీటి శివకుమార్ ఇంటి జాగాలో 40 సంవత్సరాల వయసు ఉన్న చింత చెట్లను వేప చెట్లను ఎస్సై దగ్గరుండి అక్టోబరు నెల 10న నరికించి శివకుమార్ పశువులు కట్టేసుకునే స్థలం బాత్‌రూం ఇంటి అవసరాలకు ఉన్న ఖాళీగా అంతా కూడా పబ్లిక్ రస్తాలో జేసీబీతో కలిపేశారు. శివకుమార్ తనకు జరిగిన అన్యాయంపై అక్టోబరు నెల 12న జిల్లా ఎస్పీ, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్సై పైన సదరు వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధితుడు శివకుమార్ రాయచోటి లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ మరియు 5వ అదనపు జిల్లా జడ్జీ కృష్ణన్ కుట్టికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన జడ్జీ క్రిమినల్ కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేసుకోవాలని బాధితుడు శివకు మార్‌కు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి సూచించారు. దీంతో మంగళవారం శివకు మార్ రాయచోటి ఫస్ట్ క్లాస్ జ్యుడిసియల్ మెజిస్ట్రేట్ కోర్టు నందు ప్రైవేటు కేసు దాఖలు చేశారు.

## కరెంటు షాక్‌తో మృతిచెందిన పారిశుద్ధ్య కార్మికునికి 5 లక్షల పరిహారం

రాజంపేట అర్బన్, డిసెంబరు 5 ప్రభాతవార్త



గతనెల 21న రాజంపేట పట్టణం నూనెవారిపల్లె రోడ్డులో పారిశుద్ధ్య పనులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్తుషాక్‌తో దుర్మరణం చెందిన శ్రీనివాసులు కుటుంబానికి ఎపిఎస్‌పిడిసిఎల్ 5 లక్షల నష్టపరిహారాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు పరిహారానికి సంబంధించిన పత్రాలను రాజంపేట మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్దన్‌రెడ్డిలు మంగళవారం అందజేశారు. మృతుని కుటుంబానికి వెంటనే నష్టపరిహారం అందేలా కృషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలకు మున్సిపల్ ఛైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. మృతుని కుటుంబ ఖాతాలో దక్షిణప్రాంత విద్యుత్తు సంస్థ నిధులను జమ చేసిందని వివరించారు.

## ఈనెల 10న కార్తీక దిపోత్సవం

– కోలి వెంకట సుబ్బారెడ్డి

రాజంపేట, డిసెంబర్ 5ప్రభాతవార్త:

క్రిష్ణ చైతన్య ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈనెల 10న రాజంపేటలో దామోదర్ కార్తీక దిపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కోలి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఈడిగపాలెంలోని వరసిద్ధి వినాయక, పాలసుబ్రమణ్యం స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ రాజంపేట మండలంలోని ప్రజలు పాడిపంటలతో, సిరిసంపదలతో తులతూగి అష్టైశ్వర్యాలను పొందాలనే యోచనతో ఈనెల 10న రాజంపేట ఎ.బి. కళ్యాణమండపంలో ఈ కార్య క్రమాని ్న నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.